క్లుప్తంగా

సన్మానం



కాటారం: మండలంలోని దేవరాంపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు గణపతినాయక్, పద్మ, ప్రభాకర్, స్రవంతి, నర్మదలను విద్యార్థులు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ఎదుగుదలకు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌నాయక్, లక్ష్మి, భోజనాయక్, తిరుపతి, లత, తిరుపతి, అనూష, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహ కమిటిని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన ఐలయ్య, ప్రధానకార్యదర్శిగా నాగుల సాయికుమార్, కోశాధికారిగా గడ్డం వెంకటేశ్వరస్వామి, ఉపాధ్యక్షుడిగా తైనేని రమేష్, సహాయ కార్యదర్శిగా విజయగిరి దేవేందర్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారి వెంట అన్కారి అనీల్‌కుమార్, కొరిశెట్టి పవన్, దాగం గణేష్‌కుమార్, మాడెం రాము, చీలం అనీల్ ఉన్నారు.

వాహనాల తనిఖీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ మలుపు వద్ద మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ, డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం సాయంత్రం కాటారం–మహదేవపూర్ ప్రధాన రహదారిపైన వాహనాలు నిలిపి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా వేశారు. బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి పలువురికి జరిమానా వేసినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట సివిల్, టీఎస్ఎస్పీ పోలీసులు ఉన్నారు.

కూలీకి గాయాలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఉపాధిహామీ పనికి వెళ్లిన కూలీ లేతకారి జక్కమ్మ ప్రమాదశాత్తు కింద పడిపోవడంతో గురువారం కుడిచెయ్యి విరిగింది. చెయ్యి విరగడంతో ప్రథమ చికిత్స అందించారు. కాగా, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కూలీ జక్కమ్మ కోరారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



సదానందం(ఫైల్)

టేకుమట్ల: అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రామకిష్టాపూర్(వి)లో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. రామకిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన పెండెం సదానందం(51) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండే వాడని, రోజు వారిలాగే బుధవారం రాత్రి ఇంటి ఆవరణంలో ఆరుబయట పడుకుంటానని కుటుంబ సభ్యులకు చెప్పి పడుకున్నాడని తెలిపారు. కానీ గురువారం తెల్లవారే సరికి కనిపించక పోవడంతో చుట్టూ పక్కల వెతకగా వారి ఇంటి వద్ద గల చేదబావి దూలానికి చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పేర్కొన్నారు. కాగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ వెల్లడించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని స్కైవిజన్ డిజిటల్ ఆఫీస్‌లో ఈనెల 9న కొంత మంది చోరీకి పాల్పడి సెటాప్ బాక్సులను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. స్కైవిజన్ యజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తుల చిత్రాలు, వీడియో రికార్డు అయిందన్నారు. ఇందులో రామన్నగూడెం గ్రామానికి చెందిన అక్కిపెల్లి రాఘవ, గార నిశాంత్(పండు) ఆఫీస్ వద్దకు చేరుకొని పైఅంతస్తులో ఉన్న బాక్సులు ఎత్తుకెళ్లారన్నారు. పక్కా సమాచారం మేరకు రాఘవ ఇంటి వద్ద బాక్సులను రికవరీ చేశామన్నారు.

పంట బీమా.. రైతుకు ధీమా

అకాల వర్షాలకు పంటలు నేలపాలు
- క్రాప్ ఇన్సూరెన్స్ తొలగించడంతో నష్టపోతున్న రైతులు
- కొనసాగించాలని అన్నదాతల వేడుకోలు



దెబ్బతిన్న మొక్కజొన్న పంట

టేకుమట్ల: ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరిత్యాలకు గానీ, ఎదుగుదల లోపించి గానీ రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. గతంలో రైతులకు పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ ఏ కారణంచేతనైనా పంటలు దెబ్బతింటే పంట నష్టపరిహారం అందించే వారు. కానీ ఐదు సంవత్సరాలుగా పంట బీమాను తొలగించడంతో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందకపోవడంతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పంటలు పండిస్తున్న రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఈదురు గాలులు, అకాల వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రైతుల వరి, మొక్కజొన్న, అరటి తోటలు నేల వాలి తీవ్ర నష్టాలను మిగిల్చాయి. మిరప రైతుల కల్లాల్లో నిల్వ చేసిన మిర్చి పూర్తిగా తడిసిపోయింది. మిర్చి తడవడం మూలంగా కాయలో నాణ్యత లోపించడంతో మద్దతు ధర తగ్గిపోతుంది. అరటి, వరి పంటలు నేలవాలడంతో చేతికొచ్చిన పంటల వల్ల తీవ్ర నష్టాలు వచ్చాయి. మండల వ్యాప్తంగా వరి 210, మొక్కజొన్న 92, అరటి 74 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

క్రాప్ ఇన్సూరెన్స్ కొనసాగించాలి

రూ.లక్షల్లో పట్టుబడి పెట్టి పంటలు పండిస్తున్న రైతులకు అకాల వర్షాల రూపంలో తీవ్ర నష్టాలను కలిగిస్తున్నందున్న ప్రభుత్వం క్రాప్ ఇన్సూరెన్స్ కొనసాగించాలని రైతులు వేడుకుంటున్నారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం కొంత మేర ఆర్థికంగా ఆదుకుంటుదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇన్సూరెన్స్ లేకపోవడంతో మొత్తానికే నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు అకాల వర్షాలు తీవ్ర నష్టాలను మిగుల్చుతుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవట్లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పట్టించుకుని రైతుల కోసం క్రాఫ్ ఇన్సూరెన్స్‌ను కొనసాగించాలని కోరుతున్నారు.

చేతికొచ్చే సమయంలో నష్టం



ఒక ఎకరంలో మేల్ ఫిమేల్ మొక్కజొన్నతో పాటు, మరో రెండెకారాల్లో లోకల్ మొక్కజొన్న పంటను సాగు చేశా. మేల్ ఫిమేల్ మొక్కజొన్న పూర్తి అయిపోగా అకాల వర్షానికి లోకల్ మొక్కజొన్న పంట పూర్తిగా నేల వాలింది. చేతికొచ్చే సమయంలో పంట నేల వాలడంతో నష్టం తప్పదు. చివరికి పంటను కోసేందుకు సైతం పెట్టుబడి ఎక్కువగానే ఉంటుంది. రెండు రకాలుగా నష్టం వాటిల్లింది. ఇన్సూరెన్స్ గతంలో ప్రతీ సంవత్సరం చేపించే వాడిని ప్రస్తుతం ఇన్సూరెన్స్ లేదు.

– కొాడగాని కిషన్, రైతు రామకిష్టాపూర్(టి)

రైతు బాంధవుడు కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల: రైతు బాంధవుడు మాజీ సీఎం కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం నుంచి వెంకట్రావుపల్లి వరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి ఎకరానికి రూ.10వేల రైతుబంధు రైతులందరికీ అందించారని, అలాగే మృతి చెందినరైతు కుటుంబాలకు రూ.5లక్షల రైతు బీమాలో అందించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. తాగు, సాగు నీటికి ఎలాంటి కష్టాలు లేకుండా రైతుల పక్షాన నిలిచారని, కానీ నేటి ప్రభుత్వం సాగు నీరందించండి అంటూ రైతులు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పథకాలు చిరకాలం నిలిచేలా ఉన్నాయని, మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, నల్లబెల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, అచ్చె లచ్చన్న, గువ్వాడి లక్ష్మన్, శ్రీనివాస్, ఆది రఘు, ఉమేందర్‌రావు, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, బందెల నరేష్, నిమ్మల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రవి

మల్హర్: సీఎస్ఆర్ నిధుల ద్వారా మండలంలోని తాడిచర్ల గ్రామంలో నిర్మించబోయే వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరతూ.. తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి తహసీల్దార్ రవికుమార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. స్థలం కేటాయింపునకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించనట్లు తెలిపారు. ఈ మేరకు మండల ఆర్ఐకి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ కేసులను ఎత్తేయాలి



భూపాలపల్లి అర్బన్: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి అర్బన్: నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నిరసన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తప్పుడు కేసు నమోదు చేసినట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజర్ల అశోక్, రవీందర్, కొమురయ్య, శ్రీనివాస్, శ్రీను, రవి పాల్గొన్నారు.

ఈడీ చార్జ్‌షీట్‌ను ఖండిస్తున్నాం..

కాళేశ్వరం: నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ చార్జ్‌షీట్ దాఖలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మహదేవపూర్ యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ నయీమొద్దీన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమని, బీజేపీ ప్రభుత్వం ఇలాంటి ధోరణి అవలంభించడం మంచి పద్ధతి కాదన్నారు.

హిమోఫీలియా వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వినయ్‌భాస్కర్

మల్హర్: ప్రపంచ హిమోఫీలియా దినోత్సవం సందర్భంగా మండలంలో తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం వైద్య సిబ్బంది తాడిచర్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. హిమోఫిలియా రక్తం గడ్డకట్టడం ఆలస్యమయ్యే ఒక జన్యూ సంబంధ వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి పురుషులతో పాటు స్త్రీలకు కూడా రావచ్చు అని చెప్పారు. రక్తం గడ్డకట్టడం, రక్తహీనత తక్కువగా ఉండటం, పచ్చ కామెర్లు, ఇతర లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: మండలంలోని గొల్లబుద్ధారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ దేవనాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్నామని అధిక సంఖ్యలో పిల్లలను బడికి చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాలలో యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు బాల్యపు గుర్తులతో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పట్టా పత్రం మోడల్‌ను అందించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు శోభ, మహేశ్వరి ఉన్నారు.

ఉచిత కంటి వైద్యపరీక్షలు



ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కన్నాయిగూడెం: మండల పరిధిలోని బుట్టయిగూడెం, గుర్రేవుల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కంటి వైద్య పరీక్షను ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు శారీరక, మానసిక, కంటి చూపు పరీక్షలను నిర్వహించారు. వైద్యాధికారులు తిరుపతి, ఆర్‌బీఎస్‌కే జిల్లా నోడల్ అధికారి నరహరి ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో..

మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం అస్తమాజీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 23 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ములుగు ఏరియా వైద్యశాలకు రిఫర్ చేశారు. వారికి ఈ నెల 21న కంటి అపరేషన్ నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అభినవ్ తదితరులు ఉన్నారు.

21న 'భూ భారతి'పై అవగాహన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఈనెల 21న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జగదీశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు ఈ సదస్సు హాజరై భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రాపురంలోని రైతు వేదికలో ఈ నెల 22న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లక్ష్మీరాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ దివాకర అధ్యక్షతన నిర్వహిస్తామని రైతులు హాజరు కావాని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మొగుళ్లపల్లి: గర్భిణికి సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది



మొగుళ్లపల్లి: ఇస్సిపేటలో..



టేకుమట్ల: సుబ్బక్కపల్లిలో..



భూపాలపల్లి అర్బన్: కొంపల్లిలో..

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత

మొగుళ్లపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత అన్నారు. మండలంలోని పాత ఇస్సిపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సెక్టార్ లెవల్ పోషణ పక్వాడ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, హెల్త్ సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని సుబ్బక్కపల్లి, రాఘవరెడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాసమల్ల స్వప్న, కోండ్ర నిర్మల, వంగ వనమాల, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ ఆయా, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు ఉన్నారు.

పలిమెల: పోషకాహారంతోనే చిన్నపిల్లలు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్ల అన్నారు. పోషణ పక్వాడలో భాగంగా మండలంలోని తిమ్మేటిగూడెం, ముకునూర్, నీలంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు బీ.శ్రీధర్, మౌనిక, హెల్త్ డిపార్ట్‌మెంట్ హెచ్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు అరుంధతి,రేగ ఆదిలక్ష్మి, కుర్సం కమల, ఏఎన్ఎం పుష్ప, ఆశ వర్కర్ శ్రీలత, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: మండలంలోని కొంపల్లి గ్రామంలో పోషణ పక్వాడను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆకునూరి సునీత, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు రమేశ్, కోమల, గ్రామపంచాయతీ సెక్రటరీ లింగయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, మానసిక ఆరోగ్యం గురించి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు ఎం సుదేష్ణ, స్వరూప, రజిత, మమత, ఆశ కార్యకర్తలు రజిత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రేగొండ: మహిళలకు ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడమే పోషణ పక్వాడ లక్ష్యమని భూపాపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. పోషణ పక్వాడలో భాగంగా గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంధ్య, రమాదేవి పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు



మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు

పలిమెల: ఆదివాసీ యువజన సంఘం పేరుతో మావోయిస్టులకు వ్యతిరేకంగా మండలంలోని దమ్మూరు, ముకునూరు గ్రామ పంచాయతీ పరిధిలో లేఖ, పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టులు ఆదివాసీ జీవనాధారమైన అడవుల్లోకి వెళ్లడాన్ని అడ్డుకుంటార అని పోస్టర్‌లో ప్రశ్నించారు. ఎన్నాళ్లీ అరాచకాలు ఆదివాసీలు మావోయిస్టులపై తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. ఇటీవల వాడేడు–వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో వెంకటాపుం–వాజేడు మండలాల్లోని ఆదివాసీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ సీపీఐ మావోయిస్టులు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆపరేషన్ కగార్ దాడి నుంచి రక్షణ పొందడానికి కర్రెగుట్టలపై బాంబులు పెట్టామని, తునికాకు సేకరణ, వేటకు, అటవీ ఉత్పత్తుల సేకరణకు ఎవరు గుట్టలపైకి రావద్దని మావోయిస్టులు ఆ లేఖలో పేర్కొన్నారు.

పల్లె దవాఖాన పరిశీలన



పల్లె దవాఖాన వద్ద వైద్యాధికారులు, సిబ్బంది

చిట్యాల: మండలంలోని ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిట్యాల పల్లె దవాఖానను ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండింగ్) కేంద్ర బృందం సభ్యులు వర్చువల్‌గా పల్లె దవాఖానను గురువారం సందర్శించారు. పల్లె దవాఖానలో ఉన్న సౌకర్యాలను, అందులోని పరికరాలను, రిజిస్టర్‌లను రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సందీప్, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్‌లు మౌనిక, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రాకేష్, జిల్లా నాణ్యత నిర్వహణ బృందం సభ్యులు మధుబాబు, చిరంజీవి, శరత్, ఆశాలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇమ్మడిగూడెం తండాలో గుడుంబా స్థావరాలపై ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. తండాలోని ప్రతి ఇంటిలో తనిఖీలు నిర్వహించి గుడుంబా తయారీ కోసం ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసి బెల్లం పాకాన్ని పారబోశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీ చేసిన విక్రయించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



వాజేడు: మండల పరిధిలోని చింతూరు, లక్ష్మీపురం గ్రామాల మధ్యన కాలిపోయిన పైపులైన్‌కు గురువారం మరమ్మతులు చేశారు. చింతూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు గ్రామాల మధ్యన ఉన్న కట్టకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గడ్డి, పొదలు కాలుతూ వచ్చి మిషన్ భగీరథ పైపులైన్‌కు నిప్పు అంటుకుని కాలిపోయింది. దీంతో చింతూరు గ్రామానికి తాగు నీటి సరఫరా ఆగి పోయింది. విషయం తెలుసున్న మిషన్ భగీరథ గ్రిడ్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది కాలిపోయిన పైపులైన్‌కు మరమ్మతులు చేసి తాగునీటిని అందించారు.